www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 8 నవంబర్ 2024

5

తూర్పుగోదావరి

నేడు పలు గ్రామాలకు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి-పెరవలి, దేవరపల్లి, ఉండ్రాజవరం

విద్యుత్ సబ్ స్టేషన్స్ పరిధిలో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం పెరవలి మండలం అన్నవరప్పాడు, పిట్టలవేమవరం, ఖండవల్లి గ్రామాలు, కానూరు, నడపల్లి, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇఇ నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్ నిక్సన్ తెలిపారు.

దేవరపల్లి మండలం కెవి.అచ్యుతాపురం, కెవి.బంధపురం, కెవి.గొల్లగూడెంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఇఇ నారాయణ అప్పారావు, ఎఇ సిహెచ్.వెంకట్రావు తెలిపారు.

ఉండ్రాజవరం పరిధిలో పాలంగి, వివటం, కె.సావరం గ్రామాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేస్తామని ఇఇ నారాయణ అప్పారావు తెలిపారు.

కిసాన్ డ్రోన్‌ల పంపిణీ ఎప్పుడో..

- నిబంధనలపై రైతుల విజ్ఞప్తి
- సాంకేతికత కోసం ఎదురు చూపులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కిసాన్ డ్రోన్ పథకం ఆచరణలో అమలు కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రైతులకు పంట పొలాల్లో తెగుళ్ళు, పురుగుల నివారణ సత్వరమే నివారణ చేపట్టేందుకు డ్రోన్ల వినియోగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కిసాన్ డ్రోన్‌ల పథకాన్ని గత ప్రభుత్వం ప్రకటించింది. గతంలో రాష్ట్ర వ్యాప్తంగా 2 వేల డ్రోన్లను పంపిణీ చేయాలన్న లక్ష్యం కాగా ఆచరణలో పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. తాజాగా నూతన ప్రభుత్వం డ్రోన్ల పంపిణీ దిశగా అడుగులు వేయటంతో రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. మెకనైజ్డ్ అగ్రికల్చర్ పథకం కింద జిల్లాలో మండలానికి ఒకటి చొప్పున 18 (రాజమహేంద్రవరం సిటీ మినహా) మండలాల్లోని రైతులకు దాదాపు రూ.2 కోట్ల ఖర్చుతో 20 డ్రోన్లను పంపిణీ చేయాలని వ్యవసాయ శాఖ గతంలో లక్ష్యం తీసుకుంది. యూనిట్ కాస్ట్ ఎక్కువ కావడం, బ్యాంకు రుణాలకు వడ్డీతో సబ్సిడీ లేకపోవడం, డ్రోన్లను ఆపరేట్ చేసేందుకు శిక్షణ తీసుకోవాల్సి రావడం, వీటన్నింటికి మించి డ్రోన్లను వినియోగించేందుకు రక్షణ శాఖ నుంచి లైసెన్సు తీసుకోవాలనే నిబంధనలు అడ్డుగోడలుగా మారటంతో అడుగులు ముందుకు పడలేదు. జిల్లాలో కిసాన్ డ్రోన్ల పథకానికి మండలానికి మూడు డ్రోన్‌ల

చొప్పున 54 రైతు సంఘాలకు పంపిణీ చేయాల్సి ఉంది. అయితే తొలి దశలో 25 సంఘాలను ఎంపిక చేయగా 22 మంది యువ రైతులకు వ్యవసాయ క్షేత్రంలో ఇచ్చారు. శిక్షణ ఇచ్చారే గానీ.. ఐదేళ్ళయినా ఎంపిక చేసిన గ్రూపులకు డ్రోన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టలేదు. ఒక్కో డ్రోన్ ధర రూ.10 లక్షలు ఖర్చు అవుతుంది. ఐదుగురు రైతులను ఒక గ్రూపుగా ఏర్పాటు చేసి కమ్యూనిటీ హైరింగ్ గ్రూపు (సిహెచ్‌సి) ఏర్పాటు చేశారు. ఈ గ్రూపునకు రూ.10 లక్షల విలువ చేసే డ్రోన్‌లు పంపిణీ చేస్తారు. దీని కోసం ఐదుగురు ఒక్కొక్కరూ రూ.20 వేల చొప్పున మొత్తం రూ.లక్ష పెట్టుబడి పెట్టాల్సి ఉంది. వీరికి బ్యాంకు రుణానికి ప్రభుత్వమే హామీగా ఉండి ఇప్పిస్తుంది. మిగిలిన రూ.4 లక్షలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీగా అందిస్తాయి. కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఈ సబ్సిడీని భరిస్తాయి. రైతులు తీసుకున్న రూ.5 లక్షల రుణాన్ని 36 నెలల్లో వాయిదా పద్ధతిన చెల్లించాల్సి ఉంటుంది. ఈ డ్రోన్ సంఘాలు ఇతర రైతులకు అద్దె ప్రాతిపదికన అందజేయాలని తెలిపారు. అద్దెలో వచ్చే లాభంతో బ్యాంకు రుణాలు తీర్చవచ్చు. జిల్లాలో 70 శాతం మంది సన్న, చిన్నకారు రైతులే ఉన్నారు. పదెకరాల కంటే ఎక్కువ పొలం ఉన్న రైతులు కేవలం 20 శాతం మంది మాత్రమే. 4-5 ఎకరాలకు తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు ఈ డ్రోన్ల వినియోగంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. యూనిట్లోని ప్రతి రైతు రూ.20 వేల చొప్పున పెట్టుబడి పెట్టాలన్న నిబంధన లేవడం, బ్యాంకు రుణాలు, వడ్డీకి సబ్సిడీ లేకపోవడం, 36 నెలల్లో రుణం తీర్చాలనడం మొదలైన నిబంధనలు ఉండటంతో రైతులు వెనకడుగు వేస్తున్నారు. మరోవైపు డ్రోన్ ఆపరేటింగ్‌కు ఇంటర్ చదివిన రైతులకే అవకాశం కల్పిస్తామనడంతోపాటు శిక్షణకు ఎక్కువ రోజులు వెచ్చించేందుకు రైతులు ఉత్సాహం చూపడం లేదు. క్షేత్రస్థాయిలో అడ్డుగోడలుగా మారిన గత నిబంధనలను సరళతరం చేసి నూతన ప్రభుత్వమైనా వ్యవసాయ రంగంలో సాంకేతికత దిశగా అడుగులు వేయాలని రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

నేటి నుంచి సిపిఎం ప్రజాపోరు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

దేశ వ్యాప్తంగా ప్రజాసమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చేపట్టిన సిపిఎం ప్రజా పోరును జయప్రదం చేయాలని పార్టీ నాయకులు పిలుపు ఇచ్చారు. ప్రచార కార్యక్రమం పోస్టర్లను స్థానిక శ్యామల సెంటర్లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి, నగర కార్యదర్శి టి.అరుణ్, బి.పవన్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి 150 రోజులు పూర్తయ్యాయని, కానీ ఎన్నికల హామీల అమలులో విఫలం అయ్యాయని విమర్శించారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా జమిలి ఎన్నికల పేరుతో ఫెడరల్ వ్యవస్థపై దాడికి పాల్పడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న జమిలి ఎన్నికల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతూ మెజారిటీ ప్రజలపై ధరల భారాన్ని మోపుతున్నారని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి, ప్రజా పంపిణీ ద్వారా 11 రకాల నిత్యావసర సరుకులు అందించడం ద్వారా అధిక ధరలను నియంత్రించాలని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరి గానే గడచిన కాలానికి చెల్లించిన విద్యుత్ ఛార్జీలకు మరలా సర్దుబాటు ఛార్జీ పేరుతో రూ.16 వేల కోట్ల బారాన్ని రాష్ట్ర ప్రజలపై మోపడాన్ని తీవ్రంగా తప్పు పట్టారు. రాష్ట్రం, దేశంలో మహిళలకు రక్షణ లేదని, నిత్యం దాడులు, అఘాయిత్యాలు నిత్య కృత్యంగా మారాయన్నారు. ఉచిత ఇసుక హామీని అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని, నిరుద్యోగులకు భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులు, చిరు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్స్‌తో నవంబర్ 14న అన్ని మండల కేంద్రాలలో జరిగే ధర్నాలను ప్రజానీకం పాల్గొని జయప్రదం చెయ్యాలని విజ్ఞప్తి చేశారు.

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

104 ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు ఆధ్వర్యాన గురువారం డిఎంహెచ్‌ఒ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బి.పూర్ణిమ రాజు మాట్లాడుతూ 104 డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్స్‌కు మూడు నెలల జీతం బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌఖర్యాలు కల్పించాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, చట్టప్రకారం పిఎఫ్ యాజమాన్యం వాటాను యాజమాన్యమే చెల్లించాలని, బఫర్ ఉద్యోగులకు 26 పనిదినాలకు టిఎ, డిఎ చెల్లించాలన్నారు. వాహనాల మరమ్మతులు, మెయింటనెన్స్ ఛార్జీలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సుందర్, పి.ప్రకాశరావు పాల్గొన్నారు.

వినతిపత్రం అందిస్తున్న సిఐటియు నాయకులు

కస్తూరి కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి-కడియం

ఇటీవల కడియం మండలం బుర్రిలంకలో సంచలనం సృష్టించిన మహిళ అత్యాచారం, హత్య కేసులో నిందితులకు బెయిల్ పెట్టకుండా, కేసు వాదించకుండా సహచర న్యాయవాదులను కోరినట్లు బుర్రిలంక గ్రామానికి చెందిన న్యాయవాది దండుబోయిన సత్యనారాయణ మూర్తి తెలిపారు. మహిళ కేసు విషయమై ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, జనరల్ సెక్రెటరీ పి.రమేష్‌కు గురువారం ఆయన వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మూర్తి మాట్లాడుతూ ఇంత పాశవికమైన సాముహిక హత్యాచారం, హత్య చేసి చట్టం నుండి శిక్ష నుండి తప్పించు కోవడానికి నిందితులు ప్రయత్నిస్తున్నారన్నారు. ఈ సంఘటన వల్ల గ్రామంలో పనులకు రావడానికి చుట్టుపక్కల మండలాల్లో మహిళలు భయపడుతున్నారని, తమకు రక్షణ లేదని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. నిందితులు బెయిల్ కోసం కొంతమంది న్యాయవాదులను సంప్రదిస్తున్నట్టు తెలుస్తోందని, నిందితులు బెయిల్‌పై విడుదల అయితే సాక్షులను బెదిరించి, ప్రభావితంచేసి, కేసును నీరు గార్చి బయట పడే అవకాశాలు ఉన్నాయన్నారు. అదే జరిగితే కస్తూరి కుటుంబ సభ్యులకు తీవ్ర అన్యాయం జరిగి నట్లవుతుందన్నారు.

ప్రజా ప్రయోజన పనులకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

కమ్యూనిటీకి ప్రయోజనం చేకూర్చే పనులకు ప్రాధానత్య ఇవ్వాలని కలెక్టరు ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయితీరాజ్, ఇరిగేషన్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన వివిధ పనుల పురోగతి పెండింగ్ అంశాలపై సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి దశలవారీగా నివేదికలు సమర్పించాలన్నారు. డిఎంఎఫ్ కింద చేపట్టే పనుల విషయంలో తాగునీరు, మౌలిక సదుపాయాలు, స్కూల్స్ వసతి గృహాల పనులకి ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ కింద ఇప్పటి వరకూ చేపట్టిన 170 పనుల్లో 63 పనులు పూర్తయ్యాయని తెలిపారు. పంచాయతి రాజ్‌లో 173కి గాను 77 పూర్తి కాగా, 11 పురోగతిలో, ఇరిగేషన్ కింద 10 పనుల్లో 4 పూర్తి కాగా, 5 పురోగతిలో ఉన్నట్లు తెలిపారు. నియోజక వర్గాల వారీగా ప్రాధాన్యత పనులను చేపట్టడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్న రాముడు, డిఆర్‌ఒ టి.శ్రీరామ చంద్రమూర్తి, మైన్స్ అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ బివి.గిరి, ఇరిగేషన్ ఎస్ఇ జి.శ్రీనివాసరావు, పిఆర్ ఎస్ఇ పి.రామకృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రిని సందర్శించిన కమిటీ సభ్యులు

ఆసుపత్రిని సందర్శించిన అభివృద్ధి కమిటీ సభ్యులు

ప్రజాశక్తి-గోకవరం

గోకవరం ప్రభుత్వాసుపత్రిని నూతనంగా ఏర్పడ్డ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాస్, పిట్ట అరుణ్, అల్లాడ అరుణ గురువారం సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు. ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించేందుకు వైద్యులు సహకరించాలని కోరారు. వైద్య సేవ పరికరాల వివరాలను అడిగి తెలుసుకుని ఆసుపత్రిలో కావలసిన వసతులపై ఆరా తీశారు. సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు మంచి వైద్యం అందించే విధంగా వైద్యులు చర్యలు తీసుకోవాలనిసూచించారు. ఆసుపత్రిలో వసతులపై కమిటీకి తెలియజేస్తే తద్వారా ఎంఎల్ఎ జ్యోతుల నెహ్రూ దృష్టికి తీసుకెళ్లి సమస్యకు పరిష్కారం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వాసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దే విధంగా ఆయన పని చేస్తున్నారని పేర్కొన్నారు. అన్ని రోగాలకూ ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందే విధంగా అభివృద్ధి కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి ప్రధాన వైద్యురాలు వనజ కుమారి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక వైభవం సదస్సు

ప్రజాశక్తి రాజానగరం

భాషా, సంస్కృతి, కథన శక్తిని అందరూ పెంపొందుచుకోవాలని, జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆంగ్ల విభాగం, రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి, సెంటర్ ఫర్ ఎపి స్టడీస్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న 'ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక వైభవం - సదస్సు' గురువారం ప్రారంభమైంది. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ న్యూఢిల్లీ విసి ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్, విసి ఆచార్య వై.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కాప్స్ ప్రెసిడెంట్ ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి, ఆంధ్రా యూనివర్సిటీ పూర్వ విసి, కాప్స్ వైస్ ప్రెసిడెంట్ ఆచార్య జి.నాగేశ్వరరావు, సదస్సు కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, అటవీ శాఖ రిటైర్డ్ ఆఫీసర్ నళినీ మోహన్ హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ తెలుగు వైభవాన్ని భారత దేశంతో పాటు ప్రపంచ దేశాలకు తెలియజేయాలన్నారు. దేశంలో భాషాభిమానం ఎక్కువగా ఉన్నవారిలో తమిళనాడు మొదటి స్థానంలో ఉందన్నారని, తెలుగు వారు అటువంటి భాషాభిమానాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. సుప్తమైన జాతిని జాగృతం చేయడం కోసం గత వైభవ స్మరణం ఎంతో అవసరమన్నారు. కందుకూరి, గురజాడ వంటి మహనీయులు మన సంస్కృతిలో భాగమని అన్నారు. ఇటువంటి మహనీయులను స్మరించుకుంటూ భవి తరాలకు మన సంస్కృతిని అందించాలన్నారు విసి ఆచార్య వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో భాష, సాహిత్యం, ఇతిహాసాలు వాయిస్ టూ వాయిస్ జరిగిన కమ్యూనికేషన్ ఎక్కువగా ఉందని, లిఖిత పూర్వకంగా ఉన్న సంస్కృతి తక్కువగా ఉందన్నారు. మన ప్రాంతంలో ఉన్న సంస్కృతీ సంప్రదాయాలు తెలుసుకోవడానికి ఈ సదస్సు చక్కని వేదిక అవుతుందని, దీనిలోని ప్రధాన అంశాలను సమాజానికి అందించే విధంగా డాక్యుమెంటేషన్ చేయాలన్నారు.

సదస్సును ప్రారంభిస్తున్న విసిలు

జ్ఞానమంటే డిగ్రీ కాదోయ్-జ్ఞానమంటే ప్రపంచానికి ఉపయోగపడే యువశక్తిని తెలియజేయడమే అని గురజాడ మాటలు గుర్తు చేశారు. కన్వీనర్లు ఆచార్య కె.శ్రీరమేష్, ఆచార్య డి.జ్యోతిర్మయి, కాప్స్ ప్రెసిడెంట్, ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కర్రి రామారెడ్డి మాట్లాడుతూ నేటి ఆధునిక కాలంలో ఉపాధి అవకాశాలు నేపథ్యంలో సామాజిక అంశాలను విస్మరిస్తున్నారని అన్నారు. సైన్స్ అండ్ టెక్నాలజీ చాలా గొప్పవి కానీ సామాజిక అంశాలు మానవ మనుగడకు ఎక్కువ మేలు చేస్తాయన్నారు. డాక్టర్ ఎన్.సజనారాజ్, కాప్స్ సెక్రటరీ ఓలేటి సత్యనారాయణ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఉచిత ఇసుక

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నిర్మాణ పనులకు అనుగుణంగా ఇసుకను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, ట్రాక్టర్ల ద్వారా నేరుగా ఇసుకను నేరుగా తీసుకుని వెళ్ల వచ్చని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. జిల్లాలో కొత్తగా కొవ్వూరు డివిజన్ పరిధిలో మరో ఎనిమిది డిసిల్టేషన్ పాయింట్స్‌లో 7,21,500 మెట్రిక్ టన్నుల ఇసుకను శుక్రవారం నుంచి అందుబాటులో తీసుకొని వస్తామన్నారు. జిల్లాలో 16 ఓపెన్ రీచ్‌ల ద్వారా 11,13,450 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఇప్పటికే జిల్లాలో 22 డీసిల్టేషన్ పాయింట్స్‌లో 4,95,000 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. అందులో కొవ్వూరు డివిజన్ పరిధిలో ఆరు రీచ్‌లలో 2,52,500 మెట్రిక్ టన్నులు, రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో 16 రీచ్‌లలో 2,43,500 మెట్రిక్ టన్నులు ఉన్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం అర్బన్ ప్రాంతంలోని వినియోగదారులకు కోటిలింగాలు, ధవళేశ్వరం గాయత్రి రీచ్‌లలో ఇసుకను అందుబాటులో ఉంచామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కొత్తగా అందుబాటులోకి తీసుకుని వస్తున్న ఎనిమిది పాయింట్స్‌లో వాడపల్లి రీచ్‌లో 60 వేల ఎంటిలు, ఔరంగాబాద్‌లో రెండు రీచ్‌లలో 90 వేలు ఎంటిలు, ఎరినమ్మ రీచ్‌లో 37,500 ఎంటిలు, కొవ్వూరులో 15 వేలు ఎంటిలు, దండగుంట రేవులో 45 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. ఇంటి నిర్మాణం చేపట్టడం కోసం ఇంటి ప్లాన్ తోను, ఇతర ఇంటి మరమ్మత్తు పనులకు సంబంధించి గ్రామ రెవెన్యూ అధికారి ద్వారా ధవపత్రం పొంది ఇసుకను తీసుకుని వెళ్ళే వోచ్చునని తెలిపారు.

అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

అక్టోబర్ విప్లవంతో కార్మిక వర్గానికి అధికారం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

కార్మిక వర్గానికి అధికారం ఇచ్చింది అక్టోబర్ విప్లవం అని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ అన్నారు. 107వ అక్టోబర్ విప్లవ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరం నగరంలోని శ్యామల సెంటర్లో సిపిఎం కార్యాలయం వద్ద గురువారం అరుణ పతాకాన్ని పార్టీ సీనియర్ నాయకులు పోలిన వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.అరుణ్ మాట్లాడుతూ కార్మిక వర్గానికి మొదటిగా హక్కులు ఇచ్చింది సోవియట్ సోషలిస్టు ప్రభుత్వం అన్నారు. 8 గంటల పని విధానాన్ని ప్రపంచంలో తొలిసారి అమలు చేసింది లెనిన్ నాయకత్వంలో అని గుర్తు చేశారు. దేశ సంపదను లూటీ చేస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వ విధానాలను ఫలితంగా దేశంలో అసమానతలు మరింత పెరుగుతున్నాయన్నారు. అక్టోబర్ విప్లవ దినోత్సవ స్ఫూర్తితో పాలకులను నిలదీసేందుకు ప్రజా పోరాటాలు మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు తులసి, ఎస్ఎస్.మూర్తి, నాయకులు టిఎస్.ప్రకాష్, టి.సావిత్రి, కర్రి రామకృష్ణ, పడాల రామకృష్ణ, ఐ.సుబ్రహ్మణ్యం, జరీనా, సోమేశ్వరావు, రాంబాబు, రాజా, భాస్కర్, రాజేష్ పాల్గొన్నారు.

వికలాంగుల పునరావాస కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

లాలా చెరువులోని జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రాన్ని ఆర్‌డిఒ ఆర్.కృష్ణ నాయక్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక న్యాయం, సాధికారత కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ మద్దతుతో జిల్లాలో వికలాంగుల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేస్తూ, వాటిని నిర్వహించేందుకు ఏజెన్సీలని గుర్తిస్తున్నట్టు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటీ అధ్వర్యంలో లాలా చెరువు వద్ద ఏర్పాటు చేసిన కేంద్రంలో 8 మంది పిల్లలు సంరక్షణ పొందుతున్నట్లు తెలిపారు. పిల్లల తల్లితండ్రుల నుంచి వివరాలు తెలుసుకున్నట్టు తెలిపారు. తమ పిల్లల్ని ఈ కేంద్రంలో చేరిన తరువాత ఎంతో మార్పు వచ్చిందని, స్పీచింగ్ థెరపీ ద్వారా పదాల కూర్పు చెయ్యగలుగుతున్నట్లు తెలిపారు. ఆర్‌డిఒ వెంట డిఇఒ కె.వాసుదేవరావు, యు.రాజు, ఎస్.పెద్ది రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్టూన్ 'నిజం'



కేన్సర్‌పై అవగాహనా ర్యాలీలు

జాతీయ కేన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గురువారం జిల్లాలో పలుచోట్ల ర్యాలీలు నిర్వహించారు.

ప్రజాశక్తి -యంత్రాంగం

రాజమహేంద్రవరం రూరల్ 'కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తో సాధ్యం' అనే నినాదంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి బొమ్మూరు సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీని డిఎంహెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం క్యాన్సర్లలో రొమ్ము కేన్సరు, గర్భాశయం ముఖద్వార కేన్సరు, నోటి కేన్సర్‌తో దాదాపు 34 శాతం ఉన్నాయనే అంచనా ఉందన్నారు. ఇవన్నీ కూడా ప్రాథమిక దశలోనే గృహ సందర్శన చేసి 30 సంవత్సరాలు పైబడిన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. తద్వారా అనుమానిత క్యాన్సర్ లక్షణాలు ఉన్నవారిని తదుపరి రెఫెరల్ విధానం చికిత్సలు అందిస్తామన్నారు. ప్రజలందరూ ఈ నెల 14న ప్రభుత్వం నిర్వహించే గృహ సందర్శనలో భాగస్వాములై క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రాథమికంగా క్యాన్సర్ వ్యాధిని గుర్తిస్తే తదుపరి చికిత్సలు సులభతరమవుతాయని తెలిపారు.

కడియంలో ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కడియం పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న డాక్టర్ ఎన్. నాగసాయి మౌర్య ఆధ్వర్యాన కడియంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పిలు ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు డాక్టర్ ఆర్ఎస్ఎస్‌వి.ప్రసాద్, డాక్టర్ ఆర్.ఉషా దేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి, ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీను, కె.నాగమణి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం రూరల్‌లో ర్యాలీలో పాల్గొన్న డిఎంహెచ్‌ఒ

గోపాలపురం పెద్దాపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జరిగింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బంటు సౌజన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కాకి పోసియ్య, ఎఎన్‌ఎం భూక్య జ్యోతి, ఉపాధ్యాయుడు సనపల రాజశేఖర్, జగతా శ్రీనివాస్, సిఆర్‌పి కొయ్య నాగరాజు పాల్గొన్నారు.

గోకవరం ఆరోగ్య విస్తరణాధికారి డివిఎన్ మూర్తి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపిహెచ్ఇఒ శంకర్ త్వరలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్క్రీనింగ్ నిర్వహిస్తారని అందరూ సహకరించాలని తెలిపారు.

9న నన్నయలో శతాధిక కవి సమ్మేళనం

ప్రజాశక్తి-రాజానగరం

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9న జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తు న్నామని విసి ఆచార్య వై.శ్రీనివాసరావు తెలిపారు. గురురవారం యూని వర్సిటీలో దీనికి సంబం ధించిన బ్రోచర్‌ను వీసీ ఆవిష్కరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ, శ్రీశ్రీ కళావేదిక సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ శతాధిక కవి సమ్మేళనం నిర్వహిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిషా నుండి 150 మంది కవులు హాజరవుతారని చెప్పారు. యువతలో కవిత స్ఫూర్తిని నింపాలనే ఉద్దేశంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారని తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక ఛైర్మన్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో ప్రతినెలా ఆయా ప్రాంతాలలో కావ్య ఉత్సవాల కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని దానిలో భాగంగా విశ్వవిద్యాలయంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కన్వీనర్ డాక్టర్ తరపట్ల సత్యనారాయణ డాక్టర్ తలారి వాసు, డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, డాక్టర్ సంజీవయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న విసి తదితరులు

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కాజులూరు

మండలంలోని జగన్నాథగిరి గ్రామంలో జరిగిన ప్రమాదంలో సుంకర సురేష్(42) మృతి చెందాడు. గొల్లపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని జగన్నాథగిరికి చెందిన సుంకర సురేష్ కె.గంగవరం మండలం కుందూరు రైసు మిల్లులో పని చేసి బుధవారం రాత్రి తిరిగి స్వగ్రామానికి ద్విచక్రవాహనంపై వస్తూ జగన్నాథగిరి గ్రామ రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గాయపడిన సురేష్‌ను కుటుంబ సభ్యులు స్థానిక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే సురేష్ మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు ఎస్ఐ మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

పురుగుల మందు తాగిన వ్యక్తి ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని మల్లేపల్లి గ్రామానికి చెందిన వి.వీరబాబు(31) మద్యానికి బానిసై వివాహం జరిగి నాలుగేళ్లు అయినా సంతానం లేకపోవడంతో మనస్థాపానికి గురియై ఈ నెల 5వ తేదీన ఇంటి వద్దే గండి మద్దు తాగాడు. దీంతో అతనిని కాకినాడ జిజిహెచ్‌కు కుటుంబీకులు తరలించారు. చికిత్స పొందుతూ అతని ఆరోగ్యం విషమించడంతో బుధవారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. ఈ మేరకు మృతిని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన ఎఎస్ఐ తెలిపారు.

కోడి వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కోడి వ్యర్థాలను తరలిస్తున్న వ్యాన్‌ను మత్స్య శాఖ తనిఖీ అధికారి రాజేంద్ర సీజ్ చేశారు. యర్రవరం జాతీయ రహదారిపై వాహనాలను తనిఖీ చేయగా కోడి వ్యర్థాలను చేపల చెరువులకు తరలిస్తున్న వ్యాన్‌ను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారని, కోడి వ్యర్థాలను ఊరికి దూరంగా పడేయడం జరిగిందని అన్నారు. ఎవరైనా చేపల, రొయ్యల చెరువులలో మానవుల అనారోగ్యానికి కారణమైన కోడి వ్యర్థాలను ఆహారంగా వేసినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

సోషల్ మీడియాలో సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ ఫోటోలను మార్ఫింగ్ చేస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్ కుమార్ తెలిపారు. రంగంపేట మండలం ఒడిశలేరుకు చెందిన వీరభత్తుల చంద్రశేఖర్ కొంతకాలంగా సోషల్ మీడియాలో అసభ్యంగా మార్ఫింగ్ చేసి పోస్టుంగులు పెడుతున్నాడు. దీంతో గోపాలపురం స్టేషన్లో ఐటి యాక్ట్ క్రింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

దాడి ఘటనపై కేసు నమోదు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రోడ్డు పై వర్షపు నీరు నిలిచిందని గత నెల 30న తల్లి, కొడుకుల పై దాడి చేసిన ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు ఈ నెల 6న కేసు నమోదు చేశారు.దీనికి సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని సోమి దేవర పాలెం సోమాలమ్మ చెరువు ప్రాంతానికి చెందిన పెండెం విజయ్ ఇంటి వద్ద వర్షపు నీరు నిలిచింది. అదే గ్రామానికి చెందిన లంక దుర్గారావు నీరు నిలిచిపోయిందని విజయ్ తో వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి దుర్గారావు విజయ్‌పై భౌతిక దాడికి దిగాడు. ఈ ఘటనలో అడ్డువచ్చిన విజయ్ తల్లిపై దాడిచేశాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడ్డ విజయ్ తల్లిని ముమ్మిడివరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి పిర్యాదు మేరకు దాడికి పాల్పడిన దుర్గారావు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ తెలిపారు.

బాలిక అదృశ్యంపై డిఎస్‌పి విచారణ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో ఒక ప్రయివేటు కళాశాలలో చదువుతున్న మైనర్ అదృశ్యంపై పెద్దాపురం డిఎస్‌పి గురువారం విచారణ చేపట్టారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో బాలిక నివాసానికి వెళ్లి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి శ్రీహరిరాజు ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిఎస్‌పి శ్రీహరిరాజు మాట్లాడుతూ బాలికను వెతికేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలోనే తల్లిదండ్రులకు అప్పగిస్తామని భరోసా ఇచ్చారు.

ఉత్తరకంచిలో ముద్రగడ పర్యటన

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

మండలంలోని ఉత్తరకంచి గ్రామంలో వైసిపి నాయకుడు ముద్రగడ పద్మనాభం గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలు చూపిస్తున్న అభిమానం, ప్రేమ, ఆప్యాయతలు, మరవలేనన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ప్రజలు తన తండ్రి దగ్గర నుంచి అభిమానిస్తూనే ఉన్నారని అన్నారు. తనను ఉద్యమకారుడుగా తయారు చేసిన గ్రామం ఉత్తరకంచి అని గుర్తు చేశారు. సాగు నీటి కోసం రైతులు ఎంతో ఇబ్బంది పడేవారని, ఆ ఇబ్బంది లేకుండా ఉండేందుకే సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి కృషి చేశానని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గౌతు స్వామి, జల్లిగంపల ప్రభాకర్‌రావు, చక్కపల్లి బాబు, లొండ బాబులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపును తొలగించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

తమ గ్రామంలో అనధికారికంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపును తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని పెదబ్రహ్మదేవం పంచాయతీ కార్యాలయం కార్యదర్శి ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు లేఖను గురువారం పంపించారు. గ్రామ సర్పంచ్ నీలపాల సత్యనారాయణ అధ్యక్షతన పాలకవర్గం ఆమోదించిన తీర్మాణం కాపీని గ్రామ కార్యదర్శి లేఖ రూపంలో అందజేశారు. గ్రామంలో మద్యం దుకాణం లేనందున గ్రామంలో ఎక్కడ మద్యం బెల్ట్ షాపులు నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కౌశల్-2024 పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

భారతీయ విజ్ఞాన మండలి, సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కౌశల్-2024 రాష్ట్రస్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీల పోస్టర్‌ను డిఇఒ వాసుదేవరావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే 8, 9, 10 విద్యార్థులకు క్విజ్, పోస్టర్, రీల్స్ విభాగాల్లో పాఠశాల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పిల్లలలో పోటీతత్వం పెంపొందించేందుకు వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో దోహదపడతాయని డిఇఒ వాసుదేవరావు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి క్విజ్‌కు తరగతికి ముగ్గురు చొప్పున 9 మంది విద్యార్థులు, పోస్టరు, రీల్స్‌కు తరగతికి ఇద్దరు చొప్పున ఆరుగురు విద్యార్థులు మొత్తం ఒక్కొక్క పాఠశాల నుండి 15 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం కల్పించామన్నారు. నవంబర్ 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో అన్ని ప్రభుత్వ పాఠశాలలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. పాఠశాల స్థాయిలో నవంబర్ 20, 21, 22 తేదీల్లో, జిల్లా స్థాయిలో డిసెంబర్ 6న ఆన్‌లైన్‌లో రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 30న విజయవాడలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన వారికి రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు పొందిన వారికి నగదు బహుమతులు అందజేయ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇఒ వాసుదేవరావు, జిల్లా కోఆర్డినేటర్ మేకాసు సత్య రేఖ, కౌశల్ కో కోఆర్డినేటర్ సూర్య చంద్ర, రామ్మోహన్, కోలా సత్యనారాయణ, రమణారావు, గణపతి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ, సిబ్బంది

మహిళల స్వయం ఉపాధి అభినందనీయం

ప్రజాశక్తి-కడియం

మహిళలు స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా తీసుకున్న రుణాలను ఆదాయ వనరులుగా మార్చుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. కడియం ప్రాంతంలో వ్యర్థపూల పదార్థాలతో అగరబత్తుల తయారీ యూనిట్‌లో శిక్షణ పొందిన మహిళలతో గురువారం కలెక్టర్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేడు మహిళలు అన్ని రంగాల్లో ముందడుగు వేస్తున్నారని స్వయం ఉపాధి కార్యక్రమాలు చెప్పడం ద్వారా పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. అక్టోబరు 20వ తేదీన పర్యావరణ పరిరక్షణ, వ్యర్థ పూల నుంచి ఆదాయ వనరుగా తునిలో ఏర్పాటు చేసిన అగరుబత్తులు తయారీ యూనిట్‌ను సందర్శించామని, యూనిట్ స్థాపన కోసం ట్రైల్ రన్ నిర్వహించి ఎందరికో స్ఫూర్తి దాయకంగా నిలుస్తున్నట్లు స్వయం సహాయక సంఘాల మహిళలని కలెక్టర్ అభినందించారు. మొత్తం 52 మంది శిక్షణ పొందగా, వారిలో తొలి యూనిట్ స్థాపన కోసం 12 మంది ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కెనరా బ్యాంక్ వారి సహకారంతో తొలుత 12 మందితో తొలి యూనిట్ స్థాపన దిశగా మహిళలు అడుగులు వేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంట డిఆర్‌డిఎ పీడీ ఎన్‌బిఎస్ మూర్తి, జిల్లా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ అధికారి కె.శ్రీనివాసరావు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఉన్నారు.

అగరు బత్తిల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన వైద్యాధికారులకు పిసిపిఎన్‌డిటి యాక్ట్‌పై అవగాహన కల్పించారు. స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేయటం చట్ట రీత్యా నేరం అని అలా ఎవరైనా చేస్తే శిక్షర్హులన్నారు. పుట్టినప్పుడు తక్కువ లింగ నిష్పత్తి ఉన్న గ్రామీణ ఆరోగ్య కేంద్రాలైన దోసకాయలపల్లి, మార్కొండపాడు, పాలచర్ల, దేవరపల్లి, తాళ్లపూడి పిహెచ్‌సిలు, యుపిహెచ్‌సిలు, రాజమండ్రి, వివిఎల్.పురం, వాంబే కాలనీ, కంబాలపేట, మెరకవీధి, ఆనందనగర్, ఇన్నీసుపేట, శంభునగర్, అద్దేపల్లి కాలనీ, నిడదవోలు నెహ్రూ నగర్, కొవ్వూరు ఎన్‌జిఒ హోమ్ వైద్యాధికారులను వివరణ అడిగి తీసుకున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ సెంటర్లను తరచుగా తనిఖీ చేయాలని, అనుమానిత స్కానింగ్ సెంటర్లలో డెకొయ్ ఆపరేషన్స్ చేయాలని సూచించారు. పిహెచ్‌సిలలో సాధారణ డెలివరీలు పెంచాలని హైరిస్క్ గర్భిణులను సామాజిక ఆసుపత్రులకు రిఫర్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్..సత్య కుమార్, మెడికల్ ఆఫీసర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు కోసం 1,680 దరఖాస్తులు

ప్రజాశక్తి-తాళ్లపూడి

పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో ఓటు హక్కు కోసం 1,680 మంది దరఖాస్తు చేసుకున్నారని తహశీల్దారు రవీంద్రనాథ్ తెలిపారు. వీటిలో 39 మంది ఆన్‌లైన్ ద్వారా 1,281 మంది ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఎంఎల్‌సి ఎన్నికల కోసం ఎక్కువ మంది ఓటర్లుగా నమోదు చేసుకోవాలని కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు పిలుపు తాళ్లపూడి మండలంలో సత్ఫలితాన్నిచ్చిందని చెప్పవచ్చు. మూడు రోజుల క్రితం వరకు ఓటు నమోదుకు ఆసక్తి చూపని పట్టభద్రులను చైతన్యవంతులను చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయం సాధించారు. ఎంఎల్‌ఎ ముప్పిడి మూడు రోజులు అన్ని గ్రామాల్లోనూ సచివాలయాలను సందర్శిస్తూ నమోదు శాతం అడుగుతూ నాయకులను చైతన్యపరిచారు.

దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

ఇంటింటికీ తాగునీటి సరఫరాకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

డిసెంబర్ నాటికి ఇంటింటికీ తాగునీరు అందించేందుకు పైపులైన్ పనులు నిర్వహిస్తున్నట్టు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఆర్.దుర్గా భవాని తెలిపారు. మండలంలోని పాలంగి, చివటం, వడ్లూరు, ఉండ్రాజవరం గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్వహిస్తున్న పనులను ఆమె పరిశీలించారు. పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చివటం పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పి.సాయి, ప్రాజెక్టు సూపర్వైజర్ కె.ఆనంద్, ఎం.జానీ, పాల్గొన్నారు.

పర్యావరణం కోసం సుస్థిరమైన భూభాగం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యాన గురువారం 'జీవ ఆధారిత పర్యావరణం కోసం సుస్థిరమైన భూభాగం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్కె సదస్సును ప్రారంభించారు. ప్రముఖ వక్తలు ప్రొఫెసర్ రంగరాజు సెల్వరాజు మట్లాడుతూ ప్రస్తుతం జీవ ఆధారిత రసాయనాలు, వాటిపై జరుగుతున్న పరిశోధనలు గురించి విశ్లేషించారు. సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బోజ గౌడ, ప్రొఫెసర్ ఎ.శ్రీనివాసరావు, డాక్టర్ సురేష్ బాబు, ప్రొఫెసర్ కె.విజయకుమార్, రామ్మోహన్ రావు పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి అధ్యాపకులు ఈ సదస్సులో వారి పరిశోధన పత్రాలను సమర్పించారు. ఈ సదస్సులో కెమిస్ట్రీ డిపార్ట్మెంట్ విభాగ అధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, డాక్టర్ దుర్గాప్రవీణ, డాక్టర్ ఎ.రాజేశ్వరి పాల్గొన్నారు.

సదస్సులో పాల్గొన్న అతిథులు, అధ్యాపకులు

మహిళా చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి - సామర్లకోట

మహిళా చట్టాలు, ఈవిటీజింగ్, మహిళలపై దాడులు, ఆపహరణ వంటి సమస్యలను ఎదుర్కొనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం జరిగింది. గురువారం స్థానిక బ్రౌన్ పేటలోని వైఆర్ఎల్ డిగ్రీ కళాశాలలో జరిగిన ఈ సదస్సులో సిఐ కృష్ణభగవాన్ బాలికలు, మహిళల ఆపహరణ, వారిపై దాడులు, ఫోక్సో యాక్ట్ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు, మహిళలు ఏదైనా అనుకోని సంఘటనలు ఎదురైనపుడు భయపడి పోకుండా కొంత ధైర్యాన్ని తెచ్చుకుని చాకాశక్యంగా తప్పించుకునే ఆలోచన చేయాలన్నారు. ప్రతివారి ఫోన్లలో పోలీస్ హెల్ప్ లైన్ నంబర్లు, దిశ యాప్ ఉంచుకుని ప్రమాదం అనుకున్నపుడు వాటిని యాక్టివేట్ చేయాలన్నారు. కళాశాలలకు వచ్చే సమయం లోనూ, తిరిగి ఇంటికి వెళ్లే సమయంలోనూ ఆకాతాయిల బెడద ఉంటున్నందున తమ ఫోన్ నుంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ కృష్ణ భగవాన్

కబడ్డీ పోటీలకు కలవలపల్లి విద్యార్థి

ప్రజాశక్తి-చాగల్లు

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు కలవలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి మట్ట కిరణ్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ముత్యాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఇటీవల యు-14 బాలుర స్కూల్ గేమ్ పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆయన పాల్గొంటారని తెలిపారు. కిరణ్ కుమార్‌కు కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులు కోయ గంగాధరను ఎస్ఎంసి కమిటీ కమిటీ సభ్యులు గ్రామస్తులు అభినందించారు.

ఉచిత గ్యాస్‌కు ఇకెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం లబ్ధిదారులు ఆధార్ నెంబరుతో అనుసంధానమైన గ్యాస్ కనెక్షన్ కార్డుకు, బ్యాంకు అక్కౌంట్ లింకు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి ఉచిత సిలిండర్ కోసం 2025 మార్చి 31 వ తేదీ లోపు బుకింగ్ చేసుకుని గ్యాస్ సిలిండర్ డెలివరీ పొందేందుకు సమయం ఉన్నదన్నారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ పొందిన అనంతరం లబ్ధిదారుకు 48 గంటల తర్వాత పనిదినాలలో ప్రభుత్వం నుండి సొమ్ము బ్యాంకు ఖాతాకు నేరుగా జమ అవుతుందని తెలిపారు.

ఘనంగా సివి రామన్ జయంతి

ప్రజాశక్తి-తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుండి సైన్స్ పట్ల ఆసక్తి కనబరుస్తూ చదువుకుంటూ దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలుగా ఎదగాలని రాగోలపల్లి పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు అన్నారు. భారతదేశ భౌతిక శాస్త్రవేత్త సివి.రామన్ జయంతి సందర్భంగా గురువారం పాఠశాల ఆవరణలో రామన్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఓటుకు 2,269 దరఖాస్తులు

ప్రజాశక్తి-గోపాలపురం

గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటు కోసం మొత్తం 2,269 దరఖాస్తులు అందినట్టు తహశీల్దారు సిహెచ్.విద్యాపతి తెలిపారు. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి గోపాలపురం మండలంలో సెప్టెంబర్ 30వ తేదీ నుండి నవంబర్ 6 వతేదీ వరకు మొత్తం 2,269 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. అందులో ఫారమ్ 18 ఆన్‌లైన్ ద్వారా 1058, ఆఫ్ లైన్ ద్వారా 1,211 మంది దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తాడిపర్రులో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందిన వారి ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టికె.విశ్వేశ్వర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కాంగ్రెస్ నేతలతో కలిసి విశ్వేశ్వరరెడ్డి తాడిపర్రు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నేతగా ఉన్న, నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాదవశాత్తు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబానికి రూ.25, రూ.50 లక్షలు పరిహారం ఇవ్వాలనే వారని, మరి ఇప్పుడు రూ.ఐదు లక్షల పరిహారం ఇచ్చి చేతులు దులుపుకోవడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఆయన ప్రమాదానికి కారణమైన ఫ్లెక్సీ ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కరుటూరి రామకృష్ణ, వరప్రసాద్ చౌదరి, రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి చిన్నం మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అరుణకుమారి, నిడదవోలు పట్టణ కార్యదర్శి షేక్ ఖాసిం, మైనారిటీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్ జాహ, పెరవలి మండల అధ్యక్షుడు బుద్దాల లక్ష్మణరావు, వీరమళ్ళ బాలాజీ, వేముల వెంకట సత్యనారాయణ, ఎస్.వెంకటరావు, కాశగాని వెంకటరమణ, కాసాని రామచంద్రరావు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మండలంలో ఫ్లెక్సీల తొలగింపు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలో ఫ్లెక్సీల తొలగింపు కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. రానున్న ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో గ్రామ గ్రామానా రహదారుల పక్కన, కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభించినట్లు ఎంపిడిఒ వివి రామారావు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో వివిధ పార్టీలు, వ్యక్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పార్టీలకు అతీతంగా గ్రామంలోని అన్ని ఫ్లెక్సీలను తొలగించనున్నట్టు చివటం పంచాయతీ కార్యదర్శి జివివి.సత్యనారాయణ తెలిపారు. తొలగించిన ఫ్లెక్సీలను ఆయా పార్టీలకు చెందినవారు తీసుకు పోతారన్నారు. ఈ నేపథ్యంలో ఆయా పార్టీల నాయకులకు సమాచారం అందించినట్లు గ్రామ కార్యదర్శులు తెలిపారు. చివటంలో పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను పంచాయతీ కార్యదర్శి సిబ్బందితో తొలగించారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న సిబ్బంది

క్రీడల అభివృద్ధికి ప్రోత్సాహం

ప్రజాశక్తి - పెద్దాపురం

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని మాజీ మున్సిపల్ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యానిర్వహణ కార్యదర్శి రాజా సూరిబాబురాజు అన్నారు. పెద్దాపురంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒలింపిక్స్‌లో క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని ఇస్తూ చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమన్నారు. ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించిన క్రీడాకారునికి రూ.75 లక్షలు ఇచ్చే ప్రోత్సాహాన్ని రూ.7కోట్లకు పెంచడం అభినందనీయమన్నారు. అలాగే స్పోర్ట్స్ కోటాను 2 శాతం నుంచి మూడు శాతం పెంచి గ్రూపు వన్ ర్యాంకు ఉద్యోగాన్ని కూడా కల్పించే విధంగా ప్రభుత్వం అడుగులు వేయడం ద్వారా క్రీడాకారులకు గుర్తింపునిస్తుందన్నారు.

యూనియన్ ప్రచారం

ప్రజాశక్తి - సామర్లకోట

డిసెంబర్ 4, 5 తేదీల్లో జరగనున్న సామర్లకోట బ్రాంచ్ రైల్వే యూనియన్ సంఘాల ఎన్నికల ప్రచారాన్ని గురువారం రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ అధ్వర్యంలో గురువారం ప్రారంభం అయింది. స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలో ఉద్యోగుల సంఖ్య ఎక్కువగా ఉందని, అందుకే ఇక్కడ నుంచే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టినట్లు యూనియన్ కార్యదర్శి ఎం.రమేష్ తెలిపారు. ఈ ప్రచార కార్యక్రమంలో లో జి.గణేశ్వరరావు, వైఎన్.బాబులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

NAME CHANGE

I, **ANAND NALLA,** S/o. **N.Palla Rao,** R/o. D.No. 67-1-3, Ashok Nagar, Kakinada 533003 have changed the name of My Minor Son **ORANGE PRINCE RAAVAN NALLA** (Old Name), aged 15 years and he shall hereafter be known as **ORANGE PRINCE NALLA** (New Name).

NAME CHANGE

I, **ANAND NALLA,** S/o. **N.Palla Rao,** R/o. D.No. 67-1-3, Ashok Nagar, Kakinada 533003 have changed the name of My Minor Son **MILIND MANGO PRINCE NALLA** (Old Name), aged 14 years and he shall hereafter be known as **MANGO PRINCE NALLA** (New Name).

సర్టిఫికెట్లు పోయినవి

కాకినాడ జిల్లా, ఏలేశ్వరం మండలం, ఏలేశ్వరంకు చెందిన కశిరెడ్డి లక్ష్మీశ్రీ నివేధ్, తండ్రి: రాజబాబు అనే నాకు చెందిన **పదో తరగతి మార్కులు జాబితా నెంబర్: 1808134535** మరియు **ఇంటర్ మార్కులు జాబితా నెంబర్: 2003255369** ఒరిజినల్ సర్టిఫికెట్లు జిరాక్స్ నిమిత్తం ఏలేశ్వరం బాలాజీ చౌక్ సెంటర్‌కు తీసుకురాగా పోయినవి. ఆచూకీ తెలిసినవారు ఈ దిగువ చిరునామాకు తెలియజేయగలరు.

కశిరెడ్డి లక్ష్మి శ్రీ నివేధ్
తండ్రి: రాజబాబు, ఏలేశ్వరం
ఏలేశ్వరం మండలం, సెల్: 9848357318

యానాం వార్తలు

ఎంఎల్ఎ గొల్లపల్లి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి - యానాం

ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్అశోక్ గురువారం వివిధ శాఖల అధికారులతో కలిసి నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాలకు సంబంధించి సమస్యలను తెలుసుకున్నారు. సాగు, తాగునీటికి ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారని ఫిర్యాదులు రావడంతో అరటికాయలంకలో ఉన్న పంపు హౌస్‌ను పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. మోటర్లు పనిచేయకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పిడబ్ల్యుడి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మోటర్లు రిపేరు చేయించి తాగు, సాగునీటికి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. రాజరాజేశ్వరి నగర్ లో రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి సంబంధించిన సమస్యను పరిష్కరించారు. అంబేద్కర్ విజ్ఞాన్ భవన్లో అంబేద్కర్ విగ్రహానికి వెనకాల రూ.13 లక్షలతో స్టెయిన్లెస్ స్టీల్‌తో నూతన మెట్లు నిర్మాణం చేపట్టి పూర్తి చేసినట్లు తెలిపారు. ట్యాక్సీ స్టాండ్ సమీపంలో అస్తవ్యస్తంగా ఉన్న ప్రధాన డ్రెయినేజీని పరిశీలించి దానికి శాశ్వత పరిష్కారం చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎఒ మునిస్వామి, ఇఇ చంద్రశేఖరన్, ఎఇ కాళ్ల నాగరాజు, మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, జెఇ భాస్కర్‌జ్యోతిరాజు పాల్గొన్నారు.

డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ శ్రీనివాస్

ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం

ప్రజాశక్తి - యానాం

స్థానిక సమగ్ర శిక్ష అభియాన్ సమావేశపు మందిరంలో ప్రాంతీయ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న 33 పోలింగ్ బూత్‌లలో 33 మంది సర్వేయర్లును నియమించి వారికి శిక్షణ ఇచ్చారు. 15 సంవత్సరాలు వయసు పైబడిన వారికి చదువు నేర్పే క్రమంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి వారి జాబితాను రూపొందించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ విద్యాశాఖ అధికారి, ఉల్లాస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పంపన లక్ష్మణ ప్రవీణ్, ఉల్లాస్ అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ కర్రి భవాని ప్రసాద్, కోఆర్డినేటర్స్ ఓలేటి దుర్గా మహాలక్ష్మి, ఎ.విజయలక్ష్మి, మిషన్ స్త్రీ శక్తి సిబ్బంది పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, SRINIVAS GOWD BOLLA (NEW NAME), S/o Musalayya" Previously called **"BOLLA SRINIVAS (OLD NAME)"** Dr. No. 2-2A-5/2, Park Road, Nidadavole, West Godavari District (Now East Godavari District), A.P., Have changed my name in **Passport No. L2935037 "BOLLA SRINIVAS (OLD NAME) is changed to "SRINIVAS GOWD BOLLA"** Hence after all my Documents and Correspondence will be continue With my new name **SRINIVAS GOWD BOLLA.**

మహారాజశ్రీ 2వ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

O.S. No. 123/2024

Between:

సత్తి మురళీకృష్ణ -వాది

మరియు

1. ఆకుల శ్రీనివాసు, S/o. సత్యనారాయణ, వయస్సు 48, ప్రైవేటు ఎంప్లాయి, డో.నెం. 2-31, జేగురుపాడు, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.
2. ఆకుల సత్యవేణి, W/o. శ్రీనివాసు, హిందువు, వయస్సు 42, గృహిణి, డో.నెం. 2-31, జేగురుపాడు, కడియం మండలం, తూ॥గో॥జిల్లా.

-1, 2 ప్రతివాదులు

పై నెంబరు దావాలో 1, 2 ప్రతివాదులు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 20-11-2024 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వి.సత్యమూర్తి

రాజమండ్రి అడ్వకేట్, రాజమండ్రి
07-11-24 సెల్:9866539256

పోయినవి

సింగంశెట్టి మోహన్‌రావు, S/o. సుబ్బారావు, R/o. డో.నెం. 82-5-3/1, Elite Home, ఫ్లాట్ నెం. 201, 1వ వీధి, విద్యుత్ నగర్, ఎ.వి.అప్పారావు రోడ్డు, రాజమహేంద్రవరం, తూ॥గో॥జిల్లాలో నివసిస్తున్న నా యొక్క **లక్ష్మి మారుతి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్** కంపెనీకి సంబంధించిన రాజమండ్రి **ICICI బ్యాంక్, దానవాయిపేట బ్రాంచ్‌కు** చెందిన **2 చెక్ బుక్స్,** మా స్థలంకు సంబంధించిన దస్తావేజులు జిరాక్స్‌లు, **ప్రామిశరీ నోట్లు** సంతకం పెట్టినవి మరియు సంతకాలు పెట్టిన చెక్కు ఇవ్వన్ని కూడా ICICI బ్యాంకు, రాజమండ్రి దానవాయిపేట బ్రాంచ్‌కి సంబంధించినవి మరియు **ఫోరం స్టాంప్స్, అడ్రస్ స్టాంప్స్** మరియు **మేనేజింగ్ డైరక్టర్ స్టాంప్స్,** విలువైన దస్తావేజులు పేపర్స్ అన్ని **బ్యాగ్‌లో** పెట్టుకొని **ది. 25-10-2024వ తేదీన** నేను నా ఇంటి నుండి నా బైక్ వెనుక హుక్కుకి తగిలించుకుని ICICI బ్యాంకుకి వెళ్ళుచుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రస్‌కి తెలియపర్చవలసిందిగా కోరుచున్నాను. నా బ్యాగ్ దొరికి తెలియపర్చిన వారికి తగిన పారితోషకం ఇవ్వబడును.

సింగంశెట్టి మోహన్‌రావు
R/o. డో.నెం. 82-5-3/1, Elite Home, ఫ్లాట్ నెం. 201, 1వ వీధి, విద్యుత్ నగర్, ఎ.వి.అప్పారావు రోడ్డు రాజమండ్రి, సెల్: 9550639999

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1626/2019

Between:
Pandranki Uma Maheswara Rao ...Plaintiff
And:
Smt. Gundala Rajani Kumari ...Defendant

SUMMONS

To, The Defendant:
Smt. Gundala Rajani Kumari,
W/o. Kotayya, Hindu,
aged 50 years,
R/at D.No.80-17-21,
Padmavathi Residency,
J.N. Road, Rajahmundry.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **18-11-2024** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **18-11-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the suit will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
P.A. NARASIMHAM,
K. SANDEEP,
G.V.A. KISHORE &
CH.N. SUDHA,
Advocates, Visakhapatnam.